పద్మశ్రీ ఉమామహేశ్వరికి ఘన సత్కారం



లక్డీకాపూల్: సంస్కృతి, సంప్రదాయల సమాహారమైన ప్రాచీన హరికథ కళను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. సంస్కృతంలో హరికథ చెప్పగలిగే ఒకే ఒక్క భాగవతారిణి దాలిపర్తి ఉమా మహేశ్వరిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈక్రమంలో గురువారం సెంట్రల్ కోర్టులో ప్రణవ్ కూచిపూడి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో ఉమా మహేశ్వరికి అభినందన సత్కారం జరిగింది. పలువురు నృత్య కళాకారులు పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. పద్మశ్రీ గ్రహీత డాక్టర్ పద్మజారెడ్డి, పద్మశ్రీ ప్రకటిత మరో కళాకారిణి ఉమామహేశ్వరిని సన్మానించడం స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ పద్మజారెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ నాట్య గురువు కళాకృష్ణ సతీమణి ఉమా మహేశ్వరి గొప్ప కళాకారిణిగా ప్రశంసించారు. వేడుకలో నాట్య గురువులు నృత్య కళాకారులు కళాకృష్ణ, డా.పసుమర్తి రామలింగ శాస్త్రి, డా.కోట్ల హనుమంతరావు, డా.ఎస్పీ భారతి, డాక్టర్ వనజా ఉదయ్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ భాగవతుల సేతురామ్, కథక్ అంజుబాబు కళాపత్రిక సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పద్మజారెడ్డి శిష్యులు కూచిపూడి నృత్యాంశాలు అలరించారు.

నీటి సమస్యలకు సత్వర పరిష్కారం



జాన్ షరీఫ్‌కు మెమొరాండం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో మంచి నీటి సమస్యలను అధికారులు వేగవంతంగా పరిష్కరిస్తారని మెట్రో వాటర్ బోర్డు 4వ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్ పూల్‌బాగ్ ప్రాంతంలో నీటి సమస్యలతో పాటు నియోజకవర్గంలో మంచినీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ జాన్ షరీఫ్‌కు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత మేనేజర్లు, డీజీఎంలు వెంటనే పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో కిరణ్, శంకర్, రాజేశ్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న పెయింటింగ్ ఎగ్జిబిషన్



పెయింటింగ్స్ తిలకిస్తున్న సత్తేందర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న నుమాయిష్‌లో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్తేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.హన్మంతరావు, కోశాధికారి రాజేందర్ కుమార్, వనం కవిత పాల్గొన్నారు.

ఏఎన్నార్ అభినయ పురస్కారాల ప్రదానం



పురస్కారాలు ప్రదానం చేస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు

గన్‌ఫౌండ్రీ: డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా నియంత్రణ కమిషన్ చైర్మన్ జస్టిజ్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో యువ కళావాహిణి ఆధ్వర్యంలో సినీ నటులు జీవీ నారాయణరావు, ఆర్.ప్రసన్నరాణి, జెన్నీకు ఏఎన్నార్ అభినయ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అక్కినేని చిత్ర గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, రచయిత్రి కేవీ కృష్ణకుమారి, నిర్మాత రామ సత్యనారాయణ, యువ కళావాహిణి అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి కోసం వినతి



మంత్రి కొండా సురేఖకు బొకే అందజేస్తున్న ఆనంద్‌రావు

చార్మినార్: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరినట్లు టీపీసీసీ మాజీ కార్యదర్శి, గౌలిపురా కోట మైసమ్మ ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్ ఆనంద్‌రావు చెప్పారు. ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సురేఖను కలిసి దేవాలయాల అభివృద్ధిపై చర్చించినట్లు ఆయన తెలిపారు. గ్రేటర్ పరిధిలో అనేక ఆలయాలు ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ముఖ్యంగా పాతబస్తీలో నిజాం కాలం నుంచి కొనసాగుతున్న ఆలయాలకు ప్రభుత్వ ఆదరణ లేదని చెప్పారు.

కల్వకుంట్ల కవితది కొత్త నాటకం

బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ 'రాచాల'



గన్‌పార్కు ఎదుట నిరసన తెలుపుతున్న యుగంధర్

నాంపల్లి: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీలపై కపట ప్రేమ ఒలకబోస్తూ.. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని స్పీకర్‌కు లేఖ రాయడంపై బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గన్‌పార్కులో అమరవీరుల స్థూపం ఎదుట కవిత వైఖరికి నిరసనగా ఆందోళన చేశారు. గత తొమ్మిదన్నర ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు కవితకు పూలే విగ్రహం గుర్తు రాలేదా అని రాచాల ప్రశ్నించారు. ఇప్పుడు బీసీల కోసం కవిత ఉద్యమం చేస్తానని చెప్పడంతో తెలంగాణ సమాజం సిగ్గుపడుతోందని అన్నారు. స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించడమే కాకుండా బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఏర్పాటు చేయని ఘనత మీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా పేరు మార్చారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ కుల గణన నిర్వహణతో పాటు బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని సీఎం తీసుకున్న నిర్ణయంపై బీసీ సమాజం హర్షిస్తోందన్నారు. కార్యక్రమంలో వేములవాడ రాజ్‌కుమార్, ప్రసాద్ నాయుడు, రాజు, బ్రహ్మచారి, అనుదీప్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఏరియా కమిటీలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నేతలు, ఏరియా కమిటీ నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సూచించారు. గురువారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలో మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మొహియుద్దీన్ నాయకులకు సలహాలు, సూచనలు చేశారు. మజ్లిస్ పార్టీలో ఏరియా కమిటీలదే ప్రధాన పాత్ర అని చెప్పారు. తమ తమ కమిటీ పరిధిలో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులకు సహాయపడాలని తెలిపారు. లంగర్‌హౌస్, టోలిచౌకి, గోల్కొండ డివిజన్లలో జరుగుతున్న వరద నీటి భారీ పైపులైన్ పనుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిటీలకు తెలిపారు. ప్రజల కోసమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని విషయం బస్తీవాసులకు తెలియజేయాల్సిన బాధ్యత సైతం ఏరియా కమిటీలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ మజ్లిస్ నాయకులు అమీరుద్దీన్, మిర్జా ఎక్బాల్ అహ్మద్, అలీముద్దీన్, సయ్యద్ అలీ తదితరులున్నారు.

మైనర్లే బైక్ దొంగలు!

రిమాండ్‌కు తరలించిన పోలీసులు



మాట్లాడుతున్న చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్

దూద్‌బౌలి: చార్మినార్ పోలీసుస్టేషన్ పరిధిలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ముగ్గురిని చార్మినార్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు బాలురను జువెనైల్ జైలుకు తరలించినట్లు చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్ తెలిపారు. కేసు వివరాలు.. వ్యసనాలకు బానిసలైన ముగ్గురు మైనర్లు దొంగ తాళం చెవులతో బైకులను చేస్తున్నట్లు తెలిపారు. చోరీ చేసిన వాహనాలను గోల్కొండకు చెందిన మహ్మద్ అబ్దుల్లా ఖాన్ అలియాస్ అబ్దుల్లా ఖాన్(19) తీసుకుంటున్నారని తెలిపారు. వీటిని లంగర్‌హౌస్‌కు చెందిన మహమ్మద్ మహమ్మద్‌ఖాన్(28), గోల్కొండకు చెందిన మహ్మద్ ఇమ్రాన్(34), మహ్మద్ అబ్దుల్లా ఖాన్ ఖరీదు చేసి స్క్రాప్‌గా మార్చి.. అమ్ముకుంటున్నారని ఏసీపీ తెలిపారు. ముగ్గురు బాలురతో పాటు మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.20 లక్షల విలువ చేసే వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బాలా స్వామి తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల అరెస్టు.. సెల్‌ఫోన్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నర్సింహరాజు తదితరులు

అబిడ్స్: ఇద్దరు స్నాచర్లను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి.. వారి నుంచి ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, డీఎస్సై ఎన్.గౌరేందర్‌గౌడ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. మూడు రోజుల క్రితం అపోలో ఆస్పత్రిలో పనిచేసే ఓ మహిళ హైదర్‌గూడ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అబిడ్స్ పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. గురువారం ఉదయం ఓ హోటల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న పాతబస్తీవాసులు ఇబ్రహీం, షేక్ రసూల్ ఖాన్, సయ్యద్ అక్బర్ అలీ ఖాన్ రజ్వీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఫోన్ స్నాచింగ్ చేసినట్టు ఒప్పుకున్నారు. అదేవిధంగా గతంలో నగరంలోని ఫలక్‌నుమా పీస్‌లో ఒక చోరీ కేసు, చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు స్నాచింగ్ కేసులు, నారాయణగూడ పీఎస్ పరిధిలో ఒక స్నాచింగ్, గాంధీనగర్ పీఎస్ పరిధిలో మరో స్నాచింగ్ చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించి.. వారి నుంచి సెల్‌ఫోన్, నెంబర్‌ప్లేట్ లేని ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. త్వరితగతిన స్నాచర్లను అదుపులోకి తీసుకున్న అబిడ్స్ క్రైమ్ పోలీసులను ఏసీపీ చంద్రశేఖర్, డీసీపీ శరత్‌చంద్ర పవర్ ప్రశంసించారు.

అరకుల వేణుగోపాల్‌కు సన్మానం



అబిడ్స్: రాష్ట్ర ప్రభుత్వ నూతన సలహాదారు అరకుల వేణుగోపాల్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు, విద్యారంగంలోని సమస్యలను ఆయనతో సతీశ్ చర్చించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, డిగ్రీ కళాశాలల అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, కృష్ణ తదితరులున్నారు.

నకిలీ ఉత్పత్తుల విక్రయాలు

అబిడ్స్: బ్రాండెడ్ కంపెనీ ఉత్పత్తులంటూ నకిలీవి విక్రయిస్తున్న పలువురిపై అబిడ్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రెస్టీజ్ బ్రాండ్‌కు చెందిన నకిలీ సేఫ్టీ వాల్వ్, మిక్సర్ జార్స్ విక్రయిస్తున్న ట్రూప్ బజార్‌లోని నీమా స్పేర్ పార్ట్స్, మారుతీ స్పేర్ పార్ట్స్, రానుజా స్పేర్ పార్ట్స్ దుకాణలపై అబిడ్స్ ఎస్సై మహేందర్‌తో పాటు ఇతర సిబ్బంది దాడులు నిర్వహించారు. దాదాపు 2,200 నకిలీ ఉత్పత్తులను స్వాధీనపరచుకున్నారు. నకిలీ విక్రయదారులపై ఐపీసీ 420, 63 కాపీ రైట్స్ చట్టం కింద కేసులు నమోదు చేసినట్టు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు, ఎస్సై మహేందర్ తెలిపారు.హెచ్చరించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే

గోల్కొండ: షాపులు, రెస్టారెంట్ల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ హెచ్చరించారు. గురువారం గోల్కొండలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అర్ధరాత్రి 12 తర్వాత తీసి ఉంచే షాపులు, మాల్స్, రెస్టారెంట్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా షాపులు, రెస్టారెంట్లకు పని వేళలను ప్రభుత్వం నిర్ధారించిన విషయాన్ని ఏసీపీ గుర్తుచేశారు. అంతేకాకుండా రోడ్లపై అక్రమ పార్కింగ్‌లను కూడా ప్రోత్సహించవద్దని సూచించారు.

జీతాల చెల్లింపులపై హర్షం

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించడంపై తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నాంపల్లిలోని ఆ సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఏనాడు ఒకటో తేదీన జీతాలు చెల్లించిన దాఖలాలు లేవన్నారు. ఉద్యమంలో జెండాలు మోసిన నాల్గవ తరగతి ఉద్యోగులను కాదని.. బీఆర్ఎస్ కండువాలు వేసుకున్న వారికి నాటి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆరోపించారు.

అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్

గోల్కొండ: ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. మెహిదీపట్నం, నానల్‌నగర్, రేతిబౌలి జంక్షన్, టోలిచౌకీ చౌరస్తా, పాత ముంబాయి జాతీయ రహదారి, సెవన్ టూమ్స్ రోడ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై యథేచ్ఛగా అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. టోలిచౌకీ పశ్చిమ మండలం ఆర్టీఓ కార్యాలయం, షేక్‌పేట్ నాలా వద్దనున్న పాస్‌పోర్టు సేవా కేంద్రం ఎదుట ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల పెద్ద సంఖ్యలో రోడ్డుపై వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. అయితే, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



తెలంగాణ ప్రభారి చంద్రశేఖర్‌తో బీజేపీ నాయకులు

గోల్కొండ: పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని బీజేపీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ ప్రభారి చంద్రశేఖర్ సూచించారు. తెలంగాణ ప్రభారిగా నియమితులైన సందర్భంగా ఆయనను గురువారం బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశం మెచ్చుకుంటున్న ఒకే ఒక్క నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రధాని పేరు ప్రపంచం మొత్తం తలుచుకుంటుందన్నారు. ఆయన తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు ప్రపంచ అగ్రదేశాలను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయని చెప్పారు. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా హైట్రిక్ సాధించడం ఖాయమన్నారు. అంతేకాకుండా అవినీతికి పాల్పడుతున్న పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈసారి ఎన్నికల్లో షాక్ తగులుతుందని చెప్పారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకోవడం ఖాయమని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్, ప్రధాన కార్యదర్శి డిజ్వర్‌సింగ్, కార్వాన్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్, గోవర్ధన్, ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.

మెరుగైన సమాజం కోసం సదస్సు



సదస్సులో పాల్గొన్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: మెరుగైన సమాజం కోసం వివిధ మతాల ప్రార్థనా స్థలాలపై న్యూఢిల్లీలోని లోటస్ టెంపుల్ బహాయి హౌస్ ఆఫ్ ప్రార్థన ఆడిటోరియంలో జరిగిన జాతీయ సదస్సుకు రాష్ట్రం నుంచి రాష్ట్ర బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ హాజరయ్యారు. దేశంలోని అన్ని మతాలను గౌరవిస్తూ సమసమాజ అభివృద్ధికి ప్రతి భారతీయుడు కట్టుబడి ఉండాలనే అభిప్రాయాన్ని వక్తలు తెలిపారన్నారు.

4న ఎన్‌టీ వేదాచలం శ్రద్ధాంజలి సభ



సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

సుల్తాన్‌బజార్: ప్రగతి మహా విద్యాలయ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌టీ వేదాచలం శ్రద్ధాంజలి సభను ఈ నెల 4వ తేదీన కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు ప్రకాశ్‌కుమార్ గుప్తా, బంగారు సుధీర్‌కుమార్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేదాచలం విద్యార్థుల ఉన్నతికి ఎంతో కష్టపడ్డారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. గత నెల 12వ తేదీన వేదాచలం మృతి చెందారని, ఆయన సంస్మరణ సభను కళాశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల అందజేత

యాకుత్‌పురా: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. చార్మినార్ మండల కార్యాలయంలో గురువారం షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను 20 మంది లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్లు, తహశీల్దార్‌తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకలపై పేదలకు అవగాహన ఉంటే.. వాటిని పొందే విషయంలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బజార్, తలాబ్ చంచలం, డబీర్‌పురా, మొఘల్‌పురా కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనాబేగం, అలందార్ వాలాజాహి, నస్రీన్ సుల్తానా, చార్మినార్ మండల తహశీల్దార్ నిహారిక, మజ్లిస్ పార్టీ నాయకులు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌పై దాడిని ఖండించాలి

గోల్కొండ: భారత్ జోడో న్యాయ యాత్రలో పాల్గొన్న రాహుల్‌గాంధీపై జరిగిన దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. మణిపూర్, బెంగాల్‌లో రాహుల్‌గాంధీపై దాడులు జరిగాయని ఆయన గురువారం గుర్తు చేశారు. యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి వస్తున్న స్పందన చూడలేక కొందరు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు.

సాహితీవేత్త రామకృష్ణారావు కన్నుమూత



గోవిందరాజు రామకృష్ణారావు(ఫైల్)

సుల్తాన్‌బజార్: ప్రముఖ రచయిత, నాటక కర్త, అనువాదకుడు గోవిందరాజు రామకృష్ణారావు(95) గురువారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కృష్ణా జిల్లా కాజాలో 1929వ సంవత్సరంలో జన్మించిన ఆయన 1950లో మద్రాస్‌లో అనువాదకుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అధికార భాషా సంఘం కార్యదర్శిగా, అనువాద శాఖ సంచాలకుడిగా సేవలందించారు. 1981లో మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పదవీ స్వీకారం చేసింది మొదలు.. సినారే వెంటే రామకృష్ణారావు ఉన్నారు. కథలు, నవలలు, నాటకాలు, బాలసాహిత్య రచనలు, అనువాద రచనలు వెలువరించారు. ఆయన మరణంపై తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ సి.నారాయణరెడ్డి కుటుంబసభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆశిష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేసేందుకు అసెంబ్లీకి రావడంతో ఆశిష్‌కుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆశిష్ కుమార్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు.

ఆకట్టుకున్న క్రీడా వేడుకలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గోల్కొండ: పిల్లల్లో ఆటలపై ఆసక్తి కలిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందని బచ్‌పన్ ప్లే స్కూల్ డైరెక్టర్ హిందులతారెడ్డి అన్నారు. బచ్‌పన్ ప్లే స్కూల్ ఇంటర్ స్కూల్ కాంపిటిషన్ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. విజేతలకు డైరెక్టర్ మెడల్స్ అందించారు. కార్యక్రమంలో బచ్‌పన్ టోలిచౌకి ప్రిన్సిపాల్ హుసామా సుల్తానా, లక్ష్మీ, అమీనాభాను, శ్రీదేవి, నవనీతా తదితరులున్నారు.

మేరు కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వండి



మల్లు రవికి మెమొరాండం అందజేస్తున్న శ్రీనివాస్

అబిడ్స్: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మేరు కులస్తులకు టికెట్లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా నియమితులైన మల్లు రవికి ఆయన మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీని మేరు యువజన సంఘం నాయకులు కలిసేలా చర్యలు తీసుకోవాలని మల్లు రవికి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి తనకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని చెప్పారు.

నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు



గుంతలమయంగా సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కళాశాల రోడ్డు

నాంపల్లి: మెహిదీపట్నం డివిజన్‌లోని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కళాశాల రహదారి మరమ్మతులు నత్త నడకన సాగుతున్నాయి. పైపులైన్ నిర్మాణం కోసం వాటర్ వర్క్స్ అధికారులు ఏడాది కిందట రోడ్డు తవ్వారు. ఆపై ఆరు నెలలకు పైపులైన్లు వేశారు. అయినా, రోడ్డు పనులు పూర్తి కాలేదు. దీంతో ఇక్కడి రోడ్డంతా గుంతలమై వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, రహదారి నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని సర్కిల్ 12 ఈఈ లాల్‌సింగ్ తెలిపారు.

ఉప్పుగూడలో అభివృద్ధి పనుల పరిశీలన



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

చాంద్రాయణగుట్ట: మజ్లిస్ పార్టీతోనే ఉప్పుగూడ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్ అన్నారు. స్థానిక అరుంధతి కాలనీలో రూ.62 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఉప్పుగూడలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, మాజీ కార్పొరేటర్ సమద్ అబ్దాద్ చొరవతో మౌలిక సదుపాయలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నల్లవాగు నాలాలో కూడా ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ వెంట మజ్లిస్ నాయకులు సతీశ్, శ్రీనివాస్, బస్తీవాసులు పాల్గొన్నారు.

యోగా టోర్నమెంట్ విజేత 'వనిత' విద్యాలయం



విజేతలతో బ్రిజ్ భూషన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహించిన ఇంటర్ కాలేజీ యోగా టోర్నమెంట్ పోటీలలో సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయం బాలికల కళాశాల మొదటి బహుమతి సొంతం చేసుకుంది. ఈ మేరకు గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని వనిత మహావిద్యాలయ బాలికల కళాశాలలో విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శోభన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా యోగా ట్రోఫీని తమ కళాశాల గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ పురోహిత్, టోర్నమెంట్ సెక్రెటరీ డాక్టర్ వి.దీపిక, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న అచార్య మురళీకృష్ణ

చార్మినార్: అధ్యాపకులు ఇంటర్‌నెట్‌ని సమర్థంగా వినియోగించుకుంటే ఆంగ్ల భాషా సాహిత్యాల బోధనలో విస్తృతి పెరుగుతుందని ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ డీన్ ఆచార్య మురళీకృష్ణ అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంగ్ల భాషా సాహిత్యాల బోధనపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సులో మురళీకృష్ణ మాట్లాడుతూ.. బోధన, అభ్యాసనంలో కాలానుగుణంగా మార్పులు అనివార్యమన్నారు. విద్యార్థుల సామాజిక గ్రామీణ నేపథ్యాన్ని, అవగాహనా పరిమితులను అర్థం చేసుకుని ఆంగ్ల భాషా సాహిత్యాలను బోధించాలని సూచించారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ సదస్సుకు అధ్యక్షత వహించగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగాధిపతి ఆచార్య విజయతో పాటు ఆచార్య పరిమళ కులకర్ణి, ఆచార్య సునీత మిశ్రా, డాక్టర్ విప్లవదత్ శుక్ల, డాక్టర్ కృష్ణ చంద్ర కీర్తి, డాక్టర్ ఆది రమేశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.